ప్రమాదకరంగా కల్వర్టు

ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు | పట్టించుకోని అధికారులు


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

చిట్యాల: మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామం నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారి అధ్వానంగా ఉంది. గత సంవత్సరం అధిక వర్షాలతో కల్వర్టు కొట్టుకపోయింయి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎస్సీ కాలనీకి వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ వాసులు బావుసింగ్ పల్లి గ్రామానికి రావాలంటే అనేక అవస్థలు పడుతున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన వాహనదారులు పరకాల, భూపాలపల్లికి ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. రాత్రి సమయంలో ఈ దారి గుండా వెళ్లితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. కల్వర్టు నిర్మాణం చేయాలని గతంలో అనేకసార్లు సంబంధిత అధికారులకు, పాలకులకు చెప్పిన కనీసం పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మాణ పనులు చేపట్టాలి



గతంలో కురిసిన వర్షాల మూలంగా కల్వర్టు పూర్తిగా కొట్టుకపోయింది. దీంతో ఎస్సీ కాలనీ వాసులు అనేక అవస్థలు పడుతున్నారు. అలాగే ఈ దారి గుండానే బావుసింగ్‌పల్లి గ్రామస్తులు ఇతర గ్రామాలకు వెళ్తుంటారు. అదుపు తప్పితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. కావున త్వరితగతిన కల్వర్టు నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలి.

-నారాయణరావు,
మాజీ సర్పంచ్, బావుసింగ్‌పల్లి

కార్యకర్తలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, తన గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్మిసాయి గార్డెన్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాలలో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని, అందు కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కష్టపడే ప్రతీ ఒక్కరికి అవకాశాలు వస్తాయని, పదవులు కోరుకుంటే రావని, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత గ్రామ నాయకులదేనన్నారు. వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. పాత, కొత్త నాయకత్వం అని తేడా లేకుండా పనిచేయాలన్నారు. గ్రామాల్లో వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం చేసేలా చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అవగాహనతో కుష్ఠు వ్యాధి నివారణ

● వైద్యాధికారి రామారావు


మాట్లాడుతున్న రామారావు

రేగొండ: అవగాహన పెంచుకోవడం ద్వారా కుష్ఠు వ్యాధిని నివారించవచ్చని వైద్యాధికారి రామారావు అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చర్మంపైన స్పర్శ లేని రాగి మచ్చలు, నరముల తిమ్మిర్లు ఏర్పడతాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఒంటేరు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తంగళ్లపల్లి కుమారస్వామి, కల్పన కుమారి, కోటిలింగం, ప్రతాప్, రమాదేవి, ఏఎన్ఎమ్ రాధిక, ఆశవర్కర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

● ఏఓ శ్రీనివాస్‌రెడ్డి


తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

చిట్యాల: మండలంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపుల్లో మందులను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ షాపులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఫర్టిలైజర్స్ విక్రయాలకు జతగా ఎటువంటి పురుగు మందులను కలిపి అమ్మకూడదని అన్నారు. రైతులు ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా ఆధార్ కార్డు తీసుకుని రావాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ రమణకుమార్, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం


వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడకులస్తులు

కాటారం: మండలంలోని ధన్వాడలో నిర్మిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం ప్రముఖ కాంట్రాక్టర్ కామిడి వెంకట్‌రెడ్డి తన వంతు సహకారం అందించారు. నిర్మాణం కోసం సిమెంట్ బస్తాలను అందించి ఆలయ నిర్మాణం పూర్తయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ధన్వాడ గౌడ కులస్తులు వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి గురువారం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీటూరి రాజలింగు, మార్క రవి, రాజబాబు, గణపతిగౌడ్, వెంకటరాజం, చీటూరి మహేశ్, రాజేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో క్రమం తప్పకుండా విజలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ కమిటీ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. ఏదైనా అక్రమ చర్యలు గమనించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని.. అందుకు సంబంధిత శాఖల అధికారులదేనని బాధ్యత అని స్పష్టంచేశారు. కాటారం, భూపాలపల్లి డివిజన్లలో విజిలెన్స్ టీములు ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ టీములు ప్రతి రెండు నెలలకు సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువుల సరఫరాను పర్యవేక్షణ చేసేందుకు టాస్క్‌ఫోర్స్ టీములు ఏర్పాటు చేయాలని, అక్రమాలకు పాల్పడిన డీలర్లపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనానికి సరఫరాచేసే బియ్యంలో నాణ్యతను పరిశీలించాలని, నాణ్యతలేని బియ్యాన్ని తిరస్కరించాలని సూచించారు. సామాన్లు భద్రపరిచే స్టోర్ రూము, వంటశాలలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బియ్యం నిల్వచేసే స్టోర్‌లో ఎలుకలు, క్రిమి కీటకాలు దరిచేరకుండా జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, డీఆర్‌డీఓ నరేష్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, విద్యాశాఖ అధికారి రాజేందర్, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, బీసీ సంక్షేమ అధికారి శైలజ, ఎస్టీ గురుకుల పర్యవేక్షణ అధికారి జీవరత్నం, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎన్డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్


అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

పలిమెల: నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) 10వ బెటాలియన్ బృందం గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థులకు, గ్రామ ప్రజలకు వరదలు, పాముకాటు, గ్యాస్ పేలుళ్లు, భూకంపాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ సీఐ, బృందం సభ్యులు, ఉపాధ్యాయులు రవి, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, రెవెన్యూ సిబ్బంది సమ్మయ్య పాల్గొన్నారు.

సాగు నీటిని విడుదల చేయాలి


ఎమ్మెల్యే నాగరాజుతో మాట్లాడుతున్న నాయకులు

టేకుమట్ల: చలివాగులోకి సాగునీరు విడుదల చేసి పంట పొలాలను రక్షించాలని రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాకతీయ కెనాల్ ద్వారా నీటిని ముచ్చర్ల చెరువులోకి విడుదల చేసి, ఇక్కడి నుంచి చలివాగులోకి విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో సాగునీటిని పరిష్కారిస్తానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు దొంతుల శ్రీనివాస్, పంజాల రవి, అబ్బు అశోక్, మాదుగుల ప్రకాశ్, చిట్ల సురేష్ ఉన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి సాయిబాబా భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహాల మధ్య బాబా పల్లకిని సాయి భక్తులు భజాన వేసుకుని పల్లకీ సేవను ఘనంగా చేశారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చర్య తీసుకోవాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి, సుమనపల్లి, అంకుషాపూర్, కలికోటపల్లె గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లు ట్రాక్టర్ నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నయన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్న అధికారులు నిమ్మకునీరెత్తన్నట్టు వ్యవహరిస్తున్నరన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ఓంకార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేల్పుగొండ మహేందర్, మండల అధ్యక్షుడు సంఘీ రవి ఉన్నారు.

ఘనంగా మినీ జాతర


మొక్కులు చెల్లించుకున్న ప్రకాశ్‌రెడ్డి, తదితరులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారంలో ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. నిర్వహకులు కొరితే బాపు, మడే కుమార్‌ల ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి భక్తులకు మొక్కులు చెల్లించుకున్నారు. చుట్ట పక్కల గ్రామాల నుంచి భక్తజనం తరలివస్తున్నారు. అమ్మవార్ల పూనకాలతో గద్దెల ప్రాంతం హోరెత్తుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన ఐత ప్రకాశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఆకుతోట సుధాకర్, మంచినీళ్ల దుర్గయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు, వేమునూరి చంద్రశేఖర్, కోట సమ్మయ్య, నగేష్, పున్నం పాల్గొన్నారు.

అడవులను రక్షించుకుందాం..


అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ నాగమణి

● ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి

వాజేడు: అడవులను రక్షించుకుందామని ఎఫ్ఎస్ఓ మల్ల నాగమణి అన్నారు. మండల పరిధిలోని పూసూరులో గురువారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడవులను కాపాడుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందన్నారు. అడవుల మూ లంగానే ఆక్సిజన్ లభిస్తుందని, జంతువులు జీవిస్తున్నాయని, సకాలంలో వర్షాలు కురువడానికి కూడా అడవులే కారణమన్నారు. అడవుల్లో నిప్పు పెట్టడం వలన అడవులు అంతరించి పోవడమే కాకుండా జీవ రాశులకు నిలువ నీడ, ఆహారం లేకుండా పోతుందన్నారు. అడవులకు ప్రజలు ఇప్ప పువ్వులు, చీపురు సేకరణ కోసం వెళ్లినప్పుడు నిప్పు పెట్టడం, ప్రమాదవశాత్తు అంటు కోవడం జరుగకుండా చూసుకోవాలని సూచించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

● ప్రిన్సిపాల్ ఈటె రేణుక


నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

ఏటూరునాగారం: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈటె రేణుక అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని 'జాతీయ మహిళా దినోత్సవ' కార్యక్రమంను కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధ్యాపక బృందం సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సరోజినీ నాయుడు గొప్పతనమును, మహిళల విద్యా సమీకృత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అధ్యాపకులు ఫాతిమా, వెంకటయ్య, జ్యోతి, జీవవేణి, మున్ని, సుమలత, భావన, సంపత్, రమేష్, భాస్కర్, అభిలాష్, శేఖర్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కాళేశ్వరం: యువత క్రీడల్లో రాణించాలని కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ రెవెల్లి మమత నాగరాజు అన్నారు. గురువారం కాళేశ్వరంలో బందెల రాజేశ్వరి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపీటీసీ మమత నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి మెంగాని అశోక్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, నాయకులు గందెసిరి సత్యనారాయణ, మధుసూదన్, మాజీ ఆలయ ధర్మకర్త అడప సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్లంలోని మిర్చి చోరీ



రేగొండ: రాత్రనక, పగలనక రైతు పండించిన మిర్చిని కల్లాల్లో ఆరబెట్టగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. మండలంలోని భాగిర్తిపేట గ్రామానికి చెందిన బొడ్డు దేవేందర్ రెండు ఎకరాలలో రూ.2 లక్షల మేర పెట్టుబడితో మిర్చి సాగు చేశాడు. ఇటీవల కోసిన మిర్చిని కల్లంలో ఆరబెట్టిన ఆయన బుధవారం రాత్రి 11గంటల వరకు కల్లం వద్దే ఉండి ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం వచ్చే సరికి రెండు క్వింటాళ్ల మిర్చి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

రెండు ఇళ్లలో..

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడినట్లు అలస్యంగా తెలిసింది. బాధితుల కథనం ప్రకారం.. శాంతినగర్‌కాలనీలో సారాబాయి సింగరేణిలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. ఇంటికి అతి సమీపంలోనే సారాబాయి కూతురు రజినీ, అల్లుడు రాజబాబు నివాసం ఉంటున్నారు. ఈ రెండు ఇళ్లకు చెందిన వారు మూడు రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా సొంత గ్రామమైన ఇల్లందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఇంటికి తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగలు చొరబడి సారాబాయి ఇంట్లో రెండు తులాల బంగారు అభరణాలు, రూ.10 వేల వరకు నగదును ఎత్తుకెళ్లినట్లు బాధిత మహిళ తెలిపారు. ఆదేవిధంగా రజినీ ఇంట్లో కూడా తాళం పగులగొట్టి దొంగలు ప్రవేశించి, ఇంట్లోని కొన్ని విలువైన వస్తువులను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఇంటి పక్కన గల వారు రెండు ఇళ్లకు తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బాధితులు బుధవారం ఇల్లందు నుంచి భూపాలపల్లికి చేరుకుని ఇంట్లోని బీరువా తెరిచి ఉండటంతో దొంగలు పడినట్లు గుర్తించారు. అదేవిధంగా అదే కాలనీలోని శనిగరపు రాజు, మంతెన రాజయ్య అనే మరో రెండు ఇళ్లలో కూడా తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి ప్రయత్నించారు. అయితే ఈ రెండు ఇళ్లలో ప్రస్తుతం ఎవరు నివాసం ఉండటం లేదు.

బోర్నపల్లిలో..

టేకుమట్ల: మండలంలోని బోర్నపల్లిలో చోరీ జరిగిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారంతో పాటు నగదును దొంగలించినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు కొండ మొగిళి కథనం ప్రకారం.. రోజువారి మాదిరిగానే గురువారం వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా, ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.మూడు లక్షల నగదుతో పాటు ఏడు తులాల బంగారాన్ని దొంగలించినట్లు తెలిపాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక ఎస్సై దాసరి సుధాకర్ సిబ్బందితో వెళ్లి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

నాగులమ్మ ఆలయంలో పూజలు




మల్హర్: మినీ మేడారం జాతర సందర్భంగా మండలంలో కొయ్యూరు నాగులమ్మ వద్ద నిర్వహించిన మహా జాతరకు భక్తులు గురువారం భారీగా తరలివచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు చుట్ట పక్కల గ్రామాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాగులమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. నాగులమ్మ పడిగా వద్ద పూజలు చేసి, పుట్టలో పాలు పోశారు. మినీ మేడారం వెళ్లే భక్తులు నాగుల్మను దర్శించుకోని మేడారానికి బయలుదేరారు.

మండల కమిటీ ఎన్నిక



కాటారం: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) మండల నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశం, ప్రధాన కార్యదర్శిగా రాజునాయక్, ఉపాధ్యక్షులుగా గణపతినాయక్, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, కార్యదర్శులుగా మోహన్, సురేశ్, నాగరాజు, నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి భోజ్యానాయక్, జిల్లా కౌన్సిలర్లు రమణారెడ్డి, ఇంద్రరేఖ, కరుణాకర్ రావు, లక్ష్మణ్‌నాయక్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ అడిట్ కమిటీ కన్వీనర్ కృష్ణవేణి, సభ్యులు సడువలయ్య, పర్వీన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందొద్దు



రేగొండ: సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా తిరిగి పొందే అవకాశం ఉందని చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన ఆరు మొబైల్ ఫోన్‌లను రేగొండ పోలీస్ స్టేషన్‌లో బాధితులకు సీఐ అందజేశారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ కానిస్టేబుల్ ప్రవీణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై షైక్ ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి



కాళేశ్వరం: పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలో ఎమైన అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం రూపొందించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను ప్రకటించిన నేపథ్యంలో మహదేవపూర్ మండల కేంద్రంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను అన్ని గ్రామ పంచా యతీల్లో 11న ప్రకటించినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేడు(శుక్రవారం) లిఖితపూర్వకంగా సంబంధిత గ్రామ పంచాయతీల కార్యదర్శిలకు అందజేయాలని కోరారు. అభ్యంతరాలను స్వీకరించి అనంతరం 15న ఫైనల్ జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ తరఫున మనోజ్, ఏ శ్రీధర్, బీఆర్ఎస్ అలీమ్ ఖాన్, కాంగ్రెస్‌పార్టీ నుంచి అస్రార్ ఖురేషి హాజరయ్యారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

భూపాలపల్లి అర్బన్: నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలల్లోకి వెళ్లితే భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన సింగనవేన మహేశ్(21) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆస్పత్రి వైద్యుడు తాను అందించిన చికిత్స విషయంలో తనను దూషించారనే మనస్తాపంతో ఈనెల 11న పురుగుల మందు తాగాడు. దీంతో బాధితుడిని పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి తదుపరి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. కాగా, పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.